# సిరి

నిరంజనం నిద్రలేచేడు.

నిరంజనం నిద్ర లేచేడంటే ఇంగ్లీషు, తెలుగు దిన పత్రికల్ని చేరవేసే రైలు — అప్పటికప్పుడే ఆవూరి స్టేషను చేరినట్లులెక్క. నిరంజనం నిద్ర లేచేడంటే మాణిక్య విలాస్ ప్రొప్రయిటర్ _ కమ్ సర్వర్ - కమ్ సరుకుమాష్టర్ - మాణిక్యం-తొలి ఇడ్లీవాయి దించినట్లులెక్క. నిరంజనం నిద్రలేచేడంటే సరిగ్గా తెల్లవారుఝామున నాలుగున్నర అయినట్లు లెక్క.

లెక్కప్రకారం నిరంజనం నిద్రలేచేడు. లేచీ లేవటం తోనే అతనికి 'మ్యావ్ మ్యావ్' ఎదురైంది.

నిరంజనం తెరిచీ తెరవని కళ్ళని తక్కున మూసుకున్నాడు, తనలో తను విసుక్కున్నాడు, దాని రూపాన్ని వూహించుకుని చీదరించుకున్నాడు, 'వెధవశకునం' అని లోలోపల కసురుకున్నాడు. కడకు 'ఖర్మ' అని పైపైకి తిట్టుకున్నాడు.

'రాణీ' అంటూ గొంతెత్తి పిలిచిన పిలుపుకు 'మ్యావ్ మ్యావ్' వాకిట్లోకి గెంతింది. రాణి పేరున అంతఃపుర మర్యాదల్ని పొందుతున్న ఆ మార్జాలం-ఇంటివాళ్ళది.

'రాణీట, రాణి.... హుఁ పట్టెడన్నంలేక శోషొచ్చి పడిపోయిందంటే పిల్లదానికి మెతుకు పెట్టడానికి ప్రాణం పోతుందిగానీ, పిల్లికిమాత్రం రాజభోగాలు జరుపుతారు.... ఇంతకీ అది దాని జాతకమహిమ—'

అతనికి ఇంటివాళ్ళంటే కసి, వాళ్ళకి తనమీద జాలీ, సానుభూతి లేవని. అతనికి కలిగినింటివాళ్ళంటే కసీ కోపమూ, వాళ్ళకున్న ఆనందాలూ సుఖాలూ తనకు లేవని.

ఒకప్పుడు జీతపుడబ్బులచాటున ఆశలు, ఆశయాల వెలుగును మరుగుపరచుకున్న గుమాస్తా సూర్యుడు నిరంజనం రిట్రెంచ్ మెంటు రాహువు గుమాస్తా సూర్యుణ్ణి మింగిస్తే సాదామనిషిగా మిగిలిపోయేడు నిరంజనం.

ఇవాల్టి నిరంజనం నిరుద్యోగి. నిరుద్యోగి నిరంజనంకి కసీ, కోపంవూ ఎక్కువేమరి!

పెదవులు బిగపట్టి మరో నాలుగుసార్లు "హుఁ .... హుఁ".... అనుకుంటూ లేచి మంచంమీద కూర్చున్నాడు నిరంజనం.

మంచానికి క్రిందుగా ఇందిర, పాలకోసం పైటని లాగుతున్న పసిదాన్నికసురుకుంటూ ప్రక్కకి తిరుగుతోంది. ఇందిర నిరంజనం సహధర్మచారిణి! ఆమెకు కొంచెం దూరంలో గోనెపట్టామీద సత్యం, రాజు. వాళ్ళిద్దరికీ తల వైపున కుక్కిమంచంలో రమ, రాజ్యం!

నిరంజనం చూపులు రమ మీద నిలిచేయి.

నిరుద్యోగి నిరంజనంది నిండుసంసారం. రోజుకు రెండు శేర్ల బియ్యం ఆ సంసారానికి కనీసావసరం. ఆ కనీసావస రాన్ని సేకరించిపెడుతున్న కష్టజీవి రమ. కష్టజీవి రమ ఎలిమెంటరీస్కూలు టీచర్.

'కూతురే అయినా, కొడుకులా చేతికొచ్చి మా బతుకులు బయటపడకుండా ఆదుకుంటోంది' - నిరంజనంలోని తండ్రిప్రాణం కన్నకూతురే అయినా ఆమెపట్ల కృతజ్ఞతతో నిండిపోయింది.

నిరంజనం కళ్ళల్లో నీరుతిరిగింది. చేత్తో కళ్లు తుడుచుకుని మంచం దిగబోయేడు. కాళ్ళు భార్యకు తగిలేయి.

ఇందిర లేచింది. లేస్తూనేఅన్నది, "అప్పుడేలేచారేం పడుకోండి."

అతను మాట్లాడలేదు, ఆమె మాటల్లోని పరుసదనానికి మనస్సు చివుక్కుమంది.

నిరుద్యోగి నిరంజనంకి ఆత్మాభిమానం హెచ్చు. ఆత్మాభిమానానికి వాళ్ళావిడ వాడే పారిభాషికపదం రోషం.

నిరుద్యోగి నిరంజనంకి ఆలోచనాధోరణి హెచ్చే. ఆలోచనాధోరణికి అతని సహధర్మచారిణి ఊతపదం- పిచ్చి!-

నిరంజనంకి రాత్రి జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది. కంచంలో అన్నంపెట్టి ఆవెంటనే దులిపేయటం మొదలెట్టింది ఇందిర తనను. 'రేపట్నుంచీ తెల్లవారుఝామున్నే లేచి స్టేషనుకేం పోవక్కర్లేదు. అడ్డమైన చెత్తకాగితాల్నీ పోగుచేసు

కొచ్చి ముందేసుకూర్చోనక్కర్లేదు. ఉప్మాకో, చింత పండుకో ఉపయోగానికొచ్చే చిల్లరడబ్బులు కాస్తా దాని మొహాన్న పోయటం మానేయండిక. ఈడొచ్చిన ఆడపిల్ల పెళ్ళీ పెటాకులూ లేకుండా సంపాదిస్తుంటే - తిని కూర్చోవ టంకాక ఈ వ్యసనమొకటి.'

నిరంజనం పెదవి విరిచి తనలో తను గొణుక్కున్నాడు, 'నిజమే. రమ సంపాదిస్తుంటే తిని కూర్చోవటం నాకు సిగ్గుగానేవుంది.' కానీ - తనేం జేయగలడు ?

'జాతకమహిమ'- నిరంజనం కుడి అరచేతిని సాచి చూచుకున్నాడు. చిన్నప్పు డెప్పుడో ఒకజోస్యుడుచెప్పేడు, తనది యోగజాతకమని. నిజమే వాడీవరకూ వాడూ కరక్టే. తనది భ్రష్టయోగం !

'మన జాతకాలూ, యోగాలూ మనకు కనబడుతూనే వున్నయ్‌గానీ, నువ్వీ అలవాటుని మానేయాలి నాన్నా. నా మాట విని రేపణ్ణించీ ఆ పుస్తకాలూ, పేపర్లూ చూడకు-' రమ సౌమ్యంగా, ప్రాధేయపూర్వకంగాచెప్పింది. ఒక్కసారి కాదు, చాలాసార్లు చాలావిధాలుగా. అయితే తనకు మాత్రం ఆశ చావడంలేదు.

నిరుద్యోగి నిరంజనంకి అన్నీపోగా మిగిలిన పెన్నిధి ఆశ మాత్రమే.

అతని అదృష్టంమీద అతనికి నమ్మకం ఎక్కువ. అతని తెలివితేటలమీద అతనికి విశ్వాసం ఎక్కువ. అతని జాతకచక్రంమీద అతనికి గురి ఎక్కువ.

నిరుద్యోగి నిరంజనం - ఆవిధంగా గొప్ప ఆశాజీవి.

ఆశ గురించిన ఆలోచనకే ఏనుగంత సత్తువ వచ్చింది నిరంజనంకి. మంచం దిగి పిల్లలపక్కల్ని దాటుకుంటూ పెరట్లోకి నడిచేడు. అతనివెనగ్గా ఇందిర బయలుదేరింది.

ప్రహారీగోడ గూట్లోకి చెయ్యిపోనిచ్చి కచ్చికని తీసుకున్నాడు నిరంజనం. నూతి చప్టామీదికొచ్చి పళ్ళు తోమటం మొదలెట్టేడు. కచ్చికను చితుపుకుంటే గతం కదిలింది నిరంజనం కళ్ళముందు.

ఓల్డు ఎఫ్. ఏ. నిరంజనం - ఒకింటివాడు కాకపూర్వం టూత్ పేస్టులే వాడేవాడు. గుమాస్తా నిరంజనం నంజన్‌గూడు పండ్లపొడిని వాడేవాడు. నిరుద్యోగి నిరంజనం కచ్చిక వాడుతున్నాడిప్పుడు.

'జాతకమహిమ!'- నవ్వొచ్చింది నిరంజనంకి. నిరుద్యోగి నిరంజనంకి లోపల ఏడుస్తున్నా పైకి నవ్వటం చేతొచ్చు.

"ఇవాళ తారీకు ఇరవైఎనిమిది. అమ్మాయి చేతిలో కానీ లేదుట, ఇంకా ఆరు రోజులు గడవాలి - దానిజీతం రావాలంటే" పైట చెంగుతో ముఖం తుడుచుకుంటూ చెప్పింది ఇందిర.

నోట్లో నీళ్ళని పుక్కిలించి వుమ్ముతూ భార్యవైపు చూశాడు నిరంజనం. ఆచూపుల్లోని నిస్సహాయతని సహధర్మచారిణి గ్రహించింది.

'కానీ' అంటూ ఇంట్లోకొచ్చేశాడు నిరంజనం. అతని మేధస్సులో ఆలోచన మొదలయింది. 'ఇవాళ తారీఖు ఇరవై ఎనిమిది - ఇరవై ఎనిమిది'

—రెండు, ఎనిమిది ! ఎనిమిది, రెండు !

ఇరవై ఎనిమిది ! ఎనభై రెండు !

ఈ రెండు అంకెలు నిరంజనం బుర్రని తొలిచేయటం మొదలెట్టినాయి. అతనిలో ఏదో ఆవేశం, ఉత్సాహం, ఆశ విజృంభించాయి.

అద్దం ముందు నిలబడి తడిచేతులతో జుట్టుని దువ్వుకున్నాడు. నిజానికి తాటిదూలానికి తగిలించిన సారెఅద్దంలో అతని ముఖాకృతే పూర్తిగా కనిపించదు. అందులోనూ చీకటి. నిరుద్యోగి నిరంజనం నూనెరాసుకుని తలదువ్వుకోటం ఎప్పుడో మానేశాడు. అతనికి దువ్వెన అవసరమూ లేదప్పుడు.

'ఎయిట్ టూ —టూ, ఎయిట్' అనుకుంటూ బయల్దేరబోతున్న నిరంజనానికి భార్య పిలుపు వినిపించింది.

"చూడండి"

నిరంజనం ఆగి వెనక్కి చూశాడు.

'రాత్రి చెప్పిందంతా బూడిదలో పోసిన పన్నీరయిందా అప్పుడే బయల్దేరారు-'

'లేదులేవే, ఎటూ నాదగ్గర డబ్బుల్లేవుగదా—ఊరికే అలా పోయివస్తా. ఆ రేళ్ళ అలవాటు అరపూటలో పొమ్మంటే పోతుందా"

ఇందిర మాట్లాడలేదు.

నిరంజనం భారంగా కదిలేడు. భార్య పదే పదే అదే విషయాన్ని హెచ్చరిస్తుంటే అతనికి కోపమూ, కసీ కలుగుతున్నాయి. కానీ అంతలోనే ఆమె మాటల్లోని కటిక నిజాన్ని తోసిపుచ్చలేక పోతున్నాడతను. నిరంజనంకి అనిపించింది-ఇంతగా నేనీ వ్యసనానికి బానిసనై పోయానేమా అని.

'ఛాఛా పెళ్ళాం పిల్లలచేత పాటికి పదిసార్లు చెప్పించుకొనే దుస్థితికొచ్చాను. ఈఅలవాటుకి ఇవాల్టితోనే స్వస్తి చెప్పాలి.'

నిరంజనం వెనక్కి తిరిగేడు. ఇంటికేసి నాలుగడుగులు వేశాడు. అయిదోఅడుగు పడనంది. ఎయిట్ టూ-టూఎయిట్ కళ్ళముందు కనిపించినాయి. ఇదే చివరిఛాన్సు. 'ఈఒక్క ప్రయత్నంతో ఈవ్యసనానికి స్వస్తి' అనుకుని మళ్ళీ వెనక్కి సాగేడు.

అప్పుడే వేకువ విచ్చుకుంటోంది. పట్టణ వాతావరణం ప్రశాంతి నుంచి కోలాహలంలోకి దిగబోతోంది. బస్సుల రొద ప్రారంభమైంది.

నిరంజనం ఆలోచిస్తూ నడుస్తున్నాడు. ఇవాళ నిద్ర లేస్తూనే పిల్లిని చూశాడతను. రాణీని చూస్తేగాని ఉదయానే నిద్రలేవదట—తమ ఇంటి చిన్నమ్మగారు. ఆ శకునం ఆవిడకు అదృష్టదాయకంట. తనకూ అలాగే 'మ్యావు మ్యావు' శకునం ఇవాళ అదృష్టాన్నిస్తుందేమో. దీనికితోడు ఇందిర ఇవాళ తారీకు ఇరవైఎనిమిది-అంటూ గుర్తు చేసింది. రెండు,

ఎనిమిది– ఈ రెండు సంఖ్యలూ అదృష్టాన్ని కలిగించే సంఖ్యలని చదివేడుతను - తనరాశి ఫలంలో. వీటన్నిటికీ మించి తన కేదో దివ్యవాణి వినిపిస్తోంది– 'నిరుద్యోగి నిరంజనం దశ ఇక మారబోతోందని' తప్పదు - తనఅంచనా తారుమారు కావటానికి వీల్లేదు.

'ఏం, నిరంజనం నీనెంబరెంతా ?'

నిరంజనం ఆగేడు. ఆలోచన తెగింది. ఎదురుగా రామస్వామి. అతనివేపు ఎగాదిగా చూశాడు నిరంజనం. రామస్వామి ముఖంలో సంతోషం తాండవిస్తోంది.

" నేను కట్టలేదు నిన్న " అన్నాడు నిరంజనం.

" నానెంబరొచ్చింది. డబల్ ఫోర్ " ఆనందంగా చెప్పేడు రామస్వామి.

" ఎంత "

'ఆ .... .... ఎంతలే పావలా'

'ఊహూ' అంటు కదిలాడు నిరంజనం. రామస్వామి మున్సిపల్ హాస్పటల్‌లో కాంపౌండరు, నిరంజనంకి సహాధ్యాయి.

నిరంజనంకి అనిపించింది—" ఈ సవాశేర్లో పరాచికబేరాలు నాకొద్దు. చెడినంతకాలం చెడ్డాను – పావలా బెషా కట్టి. ఇవాల్టితో అటో యిటో తేలిపోవాలి. నా దరిద్రానికి ఇదే ఆఖరురోజు ...."

నిశ్చయమిచ్చిన సత్తువ నడక వేగాన్ని అధికంచేసింది. మాణిక్య విలాసు కొచ్చేశాడు. నిరంజనం లోపలకి అడుగు పెడుతుంటే అప్రియత్నంగా చేయి చొక్కా జేబులోకి పోయింది. రెండుపైసల నాణెం పైకొచ్చింది.

నిరంజనం ప్రాణం ఉసూరుమన్నది. కాఫీనీళ్ళకు లేకపోతే లేకపోయె.... పేపరుకెలా అనే సమస్య ఎదురైంది. భారంగా లోపలికెళ్ళి బెంచీమీద కూర్చున్నాడు.

నిరుద్యోగి నిరంజనంకి దినపత్రిక కొనకపోతే తోచదు. ఏ లైబ్రరీలోనో. రీడింగ్ రూమ్‌లోనో, హెయిర్ కటింగు సెలూన్‌లోనో దినపత్రిక చదవొచ్చనే జ్ఞానం అతనికీ వుంది. కానీ, నిరంజనానికి అవసరమైంది వార్తాపత్రిక కాదు, దిన పత్రికలోని వార్తలుకాదు. అతని అవసరం తీరటానికి దినపత్రిక కొనటం తప్పనిసరి. అందుకనే ఆరేళ్లనుంచీ నిరుద్యోగి నిరంజనం దినపత్రికని – అందునా ఇంగ్లీషు దిన పత్రికని కొంటూనే వున్నాడు.

'ఇవాళ రవ్విడ్లీ స్పెషల్ తీసుకురానా ?' మాణిక్యం అడిగింది.

'వొద్దుగానీ పేపరివ్వు'

'ఇదేమిటి నిరంజనంగారూ. వింతగావుందే—కాఫీ తాగందే మీరు పత్రిక ముట్టరుగా ?' – ఎదురు బెంచీ మీద రంగరాజు. రంగరాజు టైలర్,

'ఒంట్లో బాగలేదు రాజూ ....'

మాణిక్యం ఎక్స్‌ప్రెస్ తెచ్చి నిరంజనం ముందుంచి డబ్బులకోసం చేయి జాచింది. 'డబ్బులు రేపిస్తా, మాణిక్యం' అంటూ పేపరందుకోబోయాడు నిరంజనం.

మాణిక్యం విసురుగా పేపర్ని వెనక్కు తీసుకుంది.

'చాల్లేండి—కావాలంటే, కాఫీతాగండి—బోణీకాక పోయినా అరువిస్తాను. పేపరుమాత్రం డబ్బుల్లేకుండా ఇవ్వను. పేపర్ల డబ్బు ఏరోజు కారోజు ఇచ్చెయ్యాలి'

ఆరేళ్ల పరిచయంలో తనకింతటి పరపతి వున్నట్లు అప్పుడే గ్రహించాడు, నిరంజనం. పదిహేను పైసల పత్రిక కూడా అప్పు దొరకదు. నిరంజనం దృష్టి రంగరాజు మీద నిలచింది. అతన్నడిగితే?—ఏమో, అతనూ అలాగే లేదంటే—ఊహూ, అడిగి లేదనిపించుకోకూడదు.

నిరుద్యోగి నిరంజనంకు ఆత్మాభిమానం హెచ్చు. రంగరాజును అడగలేక పోయాడు. కానీ అతనిలోని కోరిక మాత్రం పేపర్ని చూడమని తొందరచేస్తోంది. మాణిక్యం నిర్మొహమాటపు మాటల్ని నెమరువేసుకుంటూ, ఆలోచనలో పడి దిక్కులు చూడసాగాడు నిరంజనం.

రంగరాజు టిఫిను, కాఫీ ముగించి మాణిక్యానికి రూపాయి కాగితాన్నిచ్చేడు, మాణిక్యం తిరిగి నలభై పైసలిచ్చింది. చిల్లర జేబులోవేసుకుని వెడుతూ అన్నాడు రంగరాజు, 'ఎందుకొచ్చిన ఆశండీ నిరంజనం గారూ. ఆరేళ్ళ నుంచీ చూస్తున్నదేగా. నామాటవిని ఇకవదిలేయండి. ఇదిమీలాంటి వాళ్ళకు తగింది కాదు.'

నిరంజనం మనస్సు కుతకుతా వుడికిపోయింది 'ఇంతేనా నీ వుచిత సలహా, ఇంకేమైనా వుందా. గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందట.'

నిరంజనం చివరిమాటలు పైకే అన్నాడుగానీఅప్పటికే రంగరాజు వెళ్ళిపోయేడు. కొద్దిసేపు ఆ కసిలోనే వుండి పోయేడు నిరంజనం

క్షణాలతర్వాత రోషం, కోపం తగ్గేయతనికి. నిన్నగాక మొన్న కళ్ళు తెరచిన రంగరాజు కూడా తనకు చెప్పేవాడయి పోయాడు. ఛీ....ఛీ.... మాణిక్యమేమో పదిహేను పైసలికి మొహం మొహం చూసుకుని వీల్లేదంది. తనకు ఇంతకంటే శాస్తి ఇంకేం జరగాలి! నిరంజనం ఇక అక్కడ కూర్చో లేకపోయాడు, లేచి బయటకు వచ్చేశాడు.

అప్పటికప్పుడే భళ్ళున తెల్లవారింది. పట్నంలో ప్రజాజీవనం ప్రారంభమైంది. నిరంజనం ఆలోచిస్తూ మెయిన్ బజారులో కొచ్చేడు.

ఇంట్లో భార్యాపిల్లలు, బయట పరిచయస్తులూ— ఇందరు హితబోధ చెప్తుంటే తనకెందుకీ ఆశ? నిశ్చింతగా ఇంటికి పోయి పడుకుంటే సరి — ఏబెడదా వుండదు.

'నిరంజనం'! ఎవరో పిలిచిన పిలుపుకి తలెత్తి పక్కకు చూశాడు నిరంజనం. గడియారాల షాపు ముందు మెట్లు మీద కూర్చున్నాడు. భీమేశ్వరం. అతను పక్కవూళ్ళో పంచాయతీ బోర్డు మెంబరు, నిరంజనంకి మిత్రుడు.

నిరంజనం అతనిదగ్గఱసా వెళ్ళాడు.

"ఎక్కడన్నా ఉద్యోగం...."

"దొరకలేదు" అతని ప్రశ్నను పూర్తిచేశాడు నిరంజనం. భీమేశ్వరంచేతిలోని దినపత్రికమీదకి మళ్ళింది నిరంజనందృష్టి. వాటిల్లో తనకు కావలసిన ఇంగ్లీషుపత్రిక కూడావుంది. ఉత్సుకతతో దాన్ని తీసుకున్నాడు నిరంజనం. యథాలాపంగా ఇచ్చేశాడు భీమేశ్వరం.

భీమేశ్వరం ఏవోప్రశ్నలు అడుగుతుంటే, పొడిపొడి సమాధానాలు చెప్పున్నాడు నిరంజనం. అతనిదృష్టి, ఆలోచన అన్నీ పేపర్లో ఆపేజీలో అట్టడుగునవున్న బొమ్మమీద వున్నాయి.

క్షణాలతర్వాత భీమేశ్వరంవద్ద సెలవుతీసుకుని ఇవతలికొచ్చాడు నిరంజనం. దినపత్రికని అతను అడగనూలేదు, ఇతను యివ్వనూలేదు.

"దేవుడిలా తారసపడ్డాడు" అనుకుని ఊపిరి పీల్చుకున్నాడు నిరంజనం. పేపర్ మడిచి చేత్తోవుచ్చుకుని గబగబ నడవసాగేడు.

* * *

నిరంజనంకి గుమ్మంలోనే ఎదురైంది రమ. తండ్రిచేతిలోని పత్రికవైపుచూస్తూ అన్నది రమ, "నేనూఅమ్మా ఎన్నిచెప్పినా ఇవాళ పేపర్ తెచ్చావన్నమాట?"

"అవునే. నువ్వూ నేనూ ఎంతగా నెత్తీనోరూ బాదుకున్నా ఆయనకేంపట్టింది. ఒకబాధ్యతా, బరువూ వుంటే

గదా, మంచీచెడూ తెలిసేందుకు," ఇందిర విసురుగా వచ్చింది లోపల్నుంచి.

నిరంజనం మాట్లాడకుండా తలవంచుకుని వెళ్ళి నులక మంచంలో పడుకుని మొహానికి పేపరు చాటుచేసుకున్నాడు.

"ఏభైఏళ్ళ మైనర్లకి ఏంచెప్పినా అర్థంకాదు"....రమ వెళ్ళిపోయింది దొడ్లోకి.

నిరంజనం గతుక్కుమన్నాడు. ఠక్కున పేపరుప్రక్కన పడేశాడు. వెళ్తున్న రమవైపు చూసేడు. అతనికి చెంపన చెళ్ళున కొట్టినట్లైంది. కూతురు మాటకు అప్రయత్నంగా కళ్ళల్లో నీరు తిరిగింది.

భర్త కళ్ళల్లోకిచూచిన ఇందిర - అతనిలోని సంచలనాన్నీ, బాధనూ అర్థంచేసుకుంది. ఏదో అనబోయి నిగ్రహించుకుంది.

"ఎంతచెప్పినా వినక మీరుబాధపడి మమ్మల్ని బాధపెడుతున్నారు" అంటూ అక్కణ్ణుంచి కదిలింది.

"నిజమే. నేను బాధపడటం మాటెలావున్నా, మిమ్మల్ని బాధపెడుతున్నాను." అనుకున్నాడు నిరంజనం. కూతురుమాట తలపుకొచ్చి అతని మనస్సంతా కలచినట్లైంది. ఏవేవో ఆలోచనలు రాసాగినై. తాను చేస్తున్నపని సవ్యమైనదికాదని తనకుతెలుసు. కానీ ఉద్యోగంకోసం తను చేసిన ఏ ప్రయత్నమూ ఫలించకపోవటం, వేరే ఏవ్యాపకమూ లేక రోజల్లా ఇంట్లో సోమరిలా కూర్చోవటం, అదృష్టం,

జాతకం, తెలివితేటలమీద తనకున్న నమ్మకం— ఇవన్నీ, తన నీ మార్గంలోకి త్రోసినై. కొంతదూరం నడిచేడు. గమ్యాన్ని చేరుకోగలననే నమ్మకంతో, ఆశతో పయనిస్తున్న తనను అర్థంతరంగా వెనక్కు తిరిగిరమ్మంటే?—

దానికి తను సిద్ధపడ్డాడు. ఇందిర ఉప్పుకో, చింత పండుకో ఉపయోగపడే పైసల్ని దీనికోసం వెచ్చించటం అవివేకమని తనకూ అనిపించింది. కాని, చివరిసారిగా ఒక్క ప్రియత్నంచేయాలనికదా తను నిశ్చయించుకున్నది?

అవును. రేపట్నుంచీ తనజీవితం గొప్ప మలుపుతిరగ బోతోంది. ఈవేళ తననిశ్చయం మారకూడదు. ఇందిర, రమ.... వాళ్ళిద్దరిమాటల్లోని ఆవేదనను, బాధ్యతను, బాధను తను అర్థంచేసుకున్నాడు. అయినా చివరిసారిగా వాళ్ళు కోరిన కోరికను మన్నించలేదు తను.

అదృష్టంమీద తనకున్న నమ్మకానికితోడు కృషి కూడా అవసరం. అందుకనే తను వుదయాన్నే పేపరుకోసం వెళ్ళేడు. దాన్ని అతిజాగ్రత్తగా నిశితంగా పరిశీలించి—చూచి, సంఖ్యను 'ఛార్ట్సు'నుంచి నిర్ణయించాలి.

నిరంజనం లేచికూర్చున్నాడు. ఎదురుగా రాజ్యం చేటలో బియ్యం పోసుకుని రాళ్ళు ఏరుతోంది. ఇందిర వంటింట్లో పనిలో నిమగ్నమైంది. రమ స్కూల్ కి వెళ్ళి పోయినట్లుంది. అడిగేడు "రాజ్యం, అక్కయ్యేదీ!" "స్కూల్ కి వెళ్ళింది"

నిరంజనంలేచి గోడకి తగిలించివున్న జాజిచెక్కల షెల్ఫుదగ్గరికి పోయేడు. దానిలో క్రిందిఅరలో పుస్తకాల అడుగునవున్న చిన్న నోట్‌బుక్‌నీ, పై అరలో వున్న భూతద్దాన్నీ, కళ్ళజోడునూ తీసుకొని - ఇవతలికొచ్చేడు. వాటితో పాటు పేపర్నికూడా తెచ్చి గోడవారగా కూలబడ్డాడు.

నిరుద్యోగి నిరంజనం గొప్పఉద్యోగంలో పడ్డాడు. పేపర్లో ఆ బొమ్మవైపు భూతద్దంలోనుంచీ చూడసాగేడు. దాన్నుంచీ ఏవేవో అర్థాల్నీ, అంకెల్నీ గుణించటం మొదలెట్టేడు. మధ్యమధ్య నోట్‌బుక్ తెరచి పొడుగుపాటి కాగితాన్ని నేలమీద పరుస్తున్నాడు. దాన్నుంచి కొన్నిఅంకెల్ని తీసుకుంటూ ఏవో లెక్కలువేయటం సాగిస్తున్నాడు.

సెకన్లు నిముషాలైనాయి. నిముషాలు గంటలుగా మారుతున్నాయి. ఉదయం మధ్యాహ్నమైంది.

'అమ్మయ్య' అని సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు నిరంజనం. నోట్‌బుక్ మూసి పక్కనపెట్టేడు, పేపర్ని మడచిపడేశాడు. కళ్ళజోడుతీసి చేత్తోపట్టుకున్నాడు. చుట్టూ వోసారి కలయజూసేడు. ఎవరూ కనిపించలేదు. "పిల్లలంతా వంటింట్లో అన్నాలు తింటున్నారు." అనుకున్నాడు.

నిరంజనంకి గొప్ప విజయాన్ని సాధించానన్న తృప్తి కలుగుతోంది. అతని ముఖంలో ఆనందం తొణికిసలాడుతోంది. తనలోతాను "టూ ఎయిట్ - ఎయిట్ టూ" అనుకుంటూ గాలిలో అక్షరాలు రాశాడు. వెంటనే జేబులోంచి పెన్సిలు తీసి పేపరుమీద 2, 8 - 8, 2 అని పిచ్చి

పిచ్చిగా గీయసాగాడు. మరికొన్ని క్షణాలకి అదే పేపరు మీాద 100 × 80 = 8000 ; 1000 × 80 = 80,000. అని ఇలా ఏవేవో అంకెల్ని వేయసాగాడు.

'ఏం విటి పిచ్చిగీతలు ....?' చొక్కాతో మూతిని తుడుచుకుంటూ పరుగెత్తుకొచ్చి అడిగేడు రాజు

నిరంజనం వాడివేపు అదోలా చూశాడు. రాజు అమాయకంగా తండ్రికళ్ళలోకి చూశాడు.

'ఇలారా, రాజూ' పిల్చేడు నిరంజనం

రాజు తండ్రి దగ్గరగా వచ్చేడు. నిరంజనం వాడ్ని ఆప్యాయంగా రెండు చేతులలోకి తీసుకుని, ఒళ్ళో కూర్చొని బెట్టుకున్నాడు. పేపరువేపు వేలితో చూపుతూ 'ఇదంతా డబ్బురా, రాజూ.... రేపో, ఎల్లుండో మనం గొప్ప భాగ్య వంతులమై పోతాం' అన్నాడు. వాడికళ్లు ఆశతో, ఆనం దముతో మెరుస్తాయని ఆశించిన నిరంజనంకి ఆశాభంగమే కలిగించి.

రాజు గడుసుగా అడిగేడు 'ఇదంతా డబ్బా,.... చిత్తుకాగితం, పిచ్చిగీతలు చూపి డబ్బంటావేం నాన్నా?'

"అదంతేలే రాజూ నువ్వుపోయి చదువుకో" అంటూ వాణ్ని పక్కకు పంపేడు నిరంజనం. ప్రక్కకుచూసేసరికి రమ, రాజ్యం తనమాటలకు ముసిముసి నవ్వులు నవ్వుతుండటం కనిపించింది నిరంజనంకు. అతనిమొహం వెలవెల పోయింది. "పిల్లల దృష్టిలో రోజురోజుకు చులకనై పోతున్నాను"

అనుకునేసరికి నిరంజనంకి బాధకలిగింది. అంతలోనే అని పించింది —రేపొద్దున వేలు. లక్షలువస్తే వాళ్ళకే తెలుస్తుందిలే నా విలువ — అని.

ఓట్లు యక్షప నిరంజనంకి - వెంటనే స్ఫురించింది అసలువిషయం. రేపొద్దున వేలు లక్షలు రావాలంటే ఈ వేళ వందలూ, వేలూ కావాలి!

నిరుద్యోగి నిరంజనంకి ఈసమస్య పెనుభూతమై కనిపించింది. అతనిలో ఆలోచన రగిలింది. అవును. తను అంకెల్ని నిశ్చయించుకున్నాడు. తన అదృష్టాన్నిపట్టి లాక్కొచ్చి తన గుప్పిట నిలుపుకున్నాడు. నిజమే. తన తెలివితేటల్ని తను సద్వినియోగపఱచుకొని ఉజ్వలభవిష్యత్తుకు బాటలు వేసుకున్నాడు.

కాని,

కానీ—

తన పథకాన్ని అమలుపర్చటానికి కావలసినసాధనం?- ఎలా దాన్ని సేకరించటం?-

నిరంజనంకి ఎప్పుడో తన ఆఫీసర్ అన్నమాటలుగుర్తొచ్చేయి. ఆయనన్నాడు, "నువ్ చాలా జీనియస్ వోయ్ నిరంజనం. నీబుర్రంతా కాషే. కానీ, అది ఆలోచనలు, పథకాలరూపంలో ఉండిపోయింది."

ఆయనమాటలు నిజమనిపించేయి. నిరంజనంకి ఏం చేయాలో పాలుపోలేదు.

"అమ్మ అన్నానికి రమ్మంటోంది." రాజ్యం మాటకు ఈలోకంలోకొచ్చేడు నిరంజనం. లేచి పెరట్లోకి నడిచేడు.

— తన ఆలోచనల నన్నిటినీ సహధర్మచారిణికి చెప్పేడు నిరంజనం. అతని మాటల్లోని ఆవేశాన్నీ, రేపు కాటన్‌మార్కెట్లో రాబోయే నెంబరు 8.2, 2.8 లో ఒకటైవుంటుందన్న అతని నమ్మకాన్నీ తెలుసుకుంది ఇందిర. అతను చెప్పిందంతా విని, చివరికి తనఉద్దేశ్యం చెప్పింది— "మన జాతకమేమిటో మనకు తెలుస్తూనే వుంది. మన మొహాల కసలు అంతఅదృష్టంలేదు. అవును."

నిరంజనం పరీక్షగాఆవిడముఖంలోకి చూసేడు.

"నిజంవండీ, మీ అదృష్టం బాగున్నా - తినేవాళ్ళ అదృష్టం బాగుండాలికదా. మేంవంతటి భోగజాతకులంకాము. నాకు తెలుసు"

నిరంజనం నీరుకారిపోయేడు. మరుక్షణంలోనే అతనికి భార్యఅంటే కోపమూ, కసీ కలిగాయి.

నిరంజనం నిరుద్యోగి!

" ఇంతకీ నువ్వుగానీ, రమగానీ ఏంవీ ఇవ్వమంటారు, అంతేనా ?" ఉమ్మి బిగపట్టి అడిగేడు నిరంజనం.

'ఇవ్వననటంలేదు మాదగ్గర డబ్బులేదంటున్నాం'

"సరే, కానివ్వండి" అని. హూఁ అంటూ పేలవంగా నవ్వాడు నిరంజనం.

నిరుద్యోగి నిరంజనంకి లోపల ఏడుస్తున్నా పైకి నవ్వటం చేతొచ్చు.

లోలోపల ఏడుస్తూ పైకి నవ్వుతున్న నిరుద్యోగి నిరంజనం— ఈ ఆపత్సమయంలో తనను ఆదుకోనగల నవ్వుల

రాయుళ్ళ నందరిని గుర్తు తెచ్చుకోసాగాడు. ఎవరెవరో కనిపించి కనుమరుగవుతున్నారు. వాళ్ళంతా ఇతరవూళ్ళలో ఎక్కడో వున్నవాళ్లు. చేతపైసాలేని తను వాళ్ళ దగ్గరకు పోయి అవసరం గడుపుకోనటం అన్నది అసంభవం. పైగా సాయంత్రంలోగా తను డబ్బు సేకరించాలి. ఇక ఊళ్ళో పరిచయస్తులు!

నిరంజనంకి మాణిక్యం చేసిన ఉపకారము గుర్తొచ్చింది. తన పరపతీ అర్థమైంది. అయినా అతనిలో ఆశ చావలేదు. ఆలోచనా పరిధిని విస్తృతం చేశాడు.

రాఘవయ్య కనిపించాడు. అతన్నొక వెయ్యి అడిగి తీసుకుంటే? రేపో మెల్లుండో ఇవ్వచ్చు.... నిరుద్యోగి నిరంజనంకి మరో ఆలోచన వచ్చి శరీరాన్ని గజగజ లాడించింది రేపు- తను నమ్ముకున్న 8,2-2,8లు ఏ జీరో గానో మారిపోతే? నిరంజనం మనస్సు భయంతో చలించి పోయింది. రాఘవయ్య ఇంట ఊడిగం చేసికూడా తీర్చుకోలేడు తను

నిరుద్యోగి నిరంజనం ఆశల ఊడల్ని కురుచ చేశాడు. ఒక వందరూపాయిలు కట్టే చాల్లే అనుకున్నాడు. దీన్తో వచ్చేడబ్బుతో ఏదోవ్యాపారం మొదలెట్టి బ్రతుకు తెరువు కల్పించుకోవచ్చు అని సరిపెట్టుకున్నాడు. వందయితే రాఘవయ్య ఇవ్వవచ్చు.

ఆశాజీవి నిరంజనం బయల్దేరేడు.

రాఘవయ్యదగ్గఱ- నిరంజనం తల్లి పల్లెటూళ్ళో చావు బ్రతుకులమధ్య కొట్టుకులాడిందని. "అయ్యో పాపం...."తో సరిపెట్టేడు రాఘవయ్య.

రామస్వామిదగ్గఱ- నిరంజనంభార్య తీవ్రమైన గుండె జబ్బుకి గురయింది. "మా హాస్పటల్లోచేర్పించు, డాక్టర్ కి నే సిఫారసుచేస్తాను"తో పెదవి విరిచేడు రామస్వామి.

భీమేశ్వరం దగ్గఱ- నిరంజనం పెద్దకొడుకు సత్యం నాగపూరులో ఎమ్మే చదువుతూ సగంలో ఆపేయాల్సి వచ్చింది. "ఐ యామ్ సారీ నిరంజనం."తో మొండిచెయ్యి చూపేడు భీమేశ్వరం.

ఆశాజీవి నిరంజనంలో ఆశ అడుగంటింది. నిరుద్యోగి నిరంజనంలోని కసి, ద్వేషం, కోపం, రోషం – తారాస్థాయి నందుకున్నై. వీటన్నిటినీ లొంగదీస్తూ అసహాయత అతన్ని ఏడ్పించబోయి నవ్వించేస్తోంది.

ఆత్మాభిమానంగల నిరంజనం తాత్కాలికంగా దాన్ని తొలగించుకొని మాణిక్యాన్ని శరణుజొచ్చేడు. "వస్తే మూడొంతులు నాది, ఒకవంతు నీది. రాకుంటే నాసొమ్ము నా కివ్వాలి - రోజుకు రూపాయకి అరపైసా వడ్డీతో-" చిన్నప్పుడు చదువుకొన్న షైలాక్ గుర్తుకొచ్చేడు. ఓల్డు ఎఫ్. ఏ. నిరంజనం గొంతులో పచ్చివెలక్కాయతో ఇవతల కొచ్చి పడ్డాడు.

క్లాక్ టవర్ లో సాయంత్రం ఆరైంది.

ఆశాజీవి నిరంజనం పిచ్చివాడైపోతున్నాడు.

'టైమయిపోతోంది, ఎలా....ఎలా?' అని జుట్టు పీక్కుంటూ రోడ్లవెంట తిరుగుతున్నాడు. షాపుల్లో వందల

కాగితాలు మార్చి అవీ ఇవీ కొంటున్నవాళ్ళని చూస్తూ వుంటే అతనికి కడుపు రగిలిపోతోంది. ఉన్నపళాన ఆ కొట్లల్లో జొరబడి అందినంతడబ్బు పుచ్చుకొని పరుగెత్తుకొచ్చి 2, 8-8, 2 మీద సమంగా కట్టేయాలనిపిస్తోంది. ఖరీదైన ఆభరణాలు పెట్టుకుని బజారున వెళ్తున్న స్త్రీలని నిలవేసి సొమ్ములు లాక్కొని పారిపోవాలనిపిస్తోంది.

కాని గుమాస్తా నిరంజనం-నిరుద్యోగి నిరంజనంలో ప్రవేశించి 'ఆగు, ఆగు' అంటున్నాడు.

"ఏంవన్నా కానీ, ఇవాళ నా ధ్యేయాన్ని నెరవేర్చాల్సిందే" కింది పెదవిని బిగపట్టి చుట్టూ కలయజూసేడు నిరంజనం. తను అప్పటివరకూ సెంటర్లో నిలబడివున్నట్టు తెలుసుకున్నాడు. వచ్చే పోయే జనాన్ని పరీక్షగా చూడసాగేడు—ఎవరైనా పరిచయస్తులు కనిపిస్తారేమోనని.

నిముషాలు గడుస్తున్నై.

టవర్ క్లాక్ ఆరూ నలభై చూపింది.

ఆశాజీవి నిరంజనంకి పెన్నిధి దొరికింది. పెద్ద పొలికేక పెట్టాడు, "రామ్మూర్తీ" అంటూ కుడిచేతిని బారెడు ముందుకుజాపి.

బీట్ కాన్‌స్టేబుల్‌కి ప్రదక్షిణంచేసి నిరంజనం ముందుకొచ్చి ఆగింది స్కూటర్.

"దేవుడిలా కనిపించావ్ రామ్మూర్తీ" కౌగలించుకున్నాడు నిరంజనం. రామ్మూర్తి లక్షాధికారి. నిరంజనంకి ఎఫ్. ఏ. లో క్లాస్ మేట్.

"సరి....సరి....ఇంతకీ ఏంవిటి విశేషం? ఇక్కడేం చేస్తున్నావ్?" ప్రశ్నల వర్షం కురిపిస్తూనే—స్కూటర్ వెనక సీట్లోవున్న వ్యక్తిని పరిచయం చేసేడు రామ్మూర్తి. "ఇతను నా బెస్టుఫ్రెండ్ మిస్టర్ రాజశేఖరం. ఈమధ్యనే అమెరికానుంచీ తిరిగొచ్చాడు. త్వరలోనే ఏదైనా వ్యాపారం ప్రారంభించాలనుకుంటున్నాడు."

పరస్పరం అభినందించుకోటం పూర్తయింది. నిరంజనం – రామ్మూర్తి, రాజశేఖరంవైపుచూసి తనను తాను పరీక్షించుకున్నాడు.

నిరుద్యోగి నిరంజనంలో ఆత్మన్యూనతాభావం తొలిసారి పైకొచ్చింది. సిగ్గుపడ్డాడు.

—ముగ్గురూకలిసి డ్రింక్స్ త్రాగడంపూర్తయింది. రామ్మూర్తిని ఆతృతగా ప్రక్కకి పిల్చేడు నిరంజనం. "ఫర్వాలేదు. చెప్పు ఇతను నాకు కాబోయే అల్లుడుకూడా, మామధ్య రహస్యాలేం లేవు....' అన్నాడు రామ్మూర్తి.

తటపటాయిస్తూనే అడిగేడు నిరంజనం. 'ఎందుకని' నిలదీసి అడిగేడు రామ్మూర్తి. "పైగా నేను ఏదో బిజినెస్ పనిమీద ఈ ఊరొచ్చాను, నా దగ్గర అంత డబ్బులేదు" అన్నాడు.

"పోనీ కనీసం ఓ వంద యివ్వు...." నిరంజనం కళ్ళల్లో నీళ్ళుతిరిగినై. రామ్మూర్తి చేతులు పట్టేసుకున్నాడు. రాజశేఖరం ఈ సంభవానికి ఆశ్చర్యపోయాడు.

రామ్మూర్తి మొండికేశాడు, కారణంచెప్తేకానీ యివ్వనని. సగం చచ్చి. హీనస్వరంతో చెప్పేడు, ఆశాజీవి

నిరంజనం. అవసరాన్ని విన్న రామ్మూర్తి అతి తేలిగ్గా నవ్వేసి "పిచ్చి చేష్టలూ నువ్వూనూ, యేఁవిటా నీ నమ్మకం" అంటూ 'టా....టా....' చెప్పి స్కూటరెక్కేడు.

నీళ్ళు నిండిన కళ్ళతో వాళ్ళనే చూస్తూండిపోయాడు నిరుద్యోగి నిరంజనం.

రాత్రి పన్నెండింటిదాకా ఎక్కడెక్కడో తిరిగి ఇంటికి చేరిన నిరంజనాన్ని చూసి కంగారు పడ్డారు ఇందిరా, రమా. మర్నాడు ఉదయం బజారుకి వెళ్ళొచ్చి ఆశాజీవి నిరంజనం 'టూ ఎయిట్' అంటూ పలవరిస్తూ కాగితాలమీద అవే అంకెల్ని గీస్తూ కూర్చుండిపోయేడు. ఇందిరా, రమా అసలు విషయం తెలుసుకొని గుడ్లనీరు గుడ్డకుక్కుకున్నారు,

నెల రోజుల తర్వాత—

"రాజశేఖర్ అండ్ కంపెనీ" మేనేజరుగా నియమితుడైనాడు, నిరంజనం. ఆశాజీవి నిరంజనం 'రాజశేఖరంకి నేనెంతో ఋణపడివున్నాను' అనటం మొదలెట్టేడు.

సంవత్సరం తర్వాత—

'మన ఫరమ్ గడించిన లాభాల్లో నీవాటా ఇరవై వేలు ఇవిగో' అని రాజశేఖరం అన్నప్పుడు ఓల్డ్ ఎఫ్.ఏ. నిరంజనంకి నిజంగా మతిపోయింది.

'అవును. నీ పెట్టుబడి ఎనభై వేలూ వ్యాపారంలో వుంది. అన్న రాజశేఖరం మాటలకు దిగ్భ్రమ చెందేడు—మేనేజర్ నిరంజనం! *